

'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 103

శుక్రవారం 4-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కార్మికుల ఆస్పత్రికి సుస్తీ

డిస్పెన్సరీలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. -4లో



పగలు కూలీ.. రాత్రి చోరీ

చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ సదానందం వెల్లడించారు. -4లో



గుండెను గుచ్చే అందమైన ముల్లు

నటీ నటులతో పాటు ఇతరులు తీసుకునే సౌందర్య చికిత్సలు. గుండెపై అవి చూపే ప్రభావాలపై ప్రత్యేక కథనం..

- వివరాలు 2లో



నీ కోసం.. నేనున్నానని..

జీవితంలోని సంక్షోభ సమయాల్లో తన తల్లి తనకు అండగా నిలబడిందని బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ చెప్పారు.

- వివరాలు 2లో



మత్స్యకార మణిహారం..

కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైన ప్రసాద్ సూరి 'సాక్షి'తో పంచుకున్న ముచ్చట్లు..

- వివరాలు ఫ్యామిలీ యువర్స్‌లో



గూగుల్ వారి 'మైక్రో లెర్నింగ్'..

సంవత్సరాలు కాదు.. నెలలు కాదు.. జస్ట్ నిమిషాల్లో చేసే గూగుల్ కోర్సుల వివరాల సమాహారం..

- వివరాలు ఫ్యామిలీ యువర్స్‌లో

న్యూస్‌రీల్

అదనపు పీపీగా చంద్రశేఖర్ పటేల్



ఎంపీ సురేశ్ షెట్కార్‌కు మిఠాయి తినిపిస్తున్న చంద్రశేఖర్ పాటిల్

నారాయణఖేడ్: సంగారెడ్డి సివిల్ జడ్జీ-సహాయ సెషన్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కంగ్టి మండలం సిద్దంగిర్గా గ్రామానికి చెందిన న్యాయవాది చంద్రశేఖర్ పటేల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ పటేల్ జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను ఆయన స్వగృహంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి మిఠాయి తినిపించారు. ప్రతిగా ఆయనను ఎంపీ సన్మానించి న్యాయవ్యవస్థలో న్యాయబద్ధత, ప్రజాసేవ ధ్యేయంగా సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యులు రషీద్, ఖేడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్అలీ, సిర్గాపూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నగేశ్‌చారి, నాయకులు కల్లయ్యస్వామి, శుక్లవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనం చెల్లించాలి

వైద్య ఆరోగ్య శాఖ ఏఓకు వినతి



ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

సంగారెడ్డి: జిల్లాలో ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తోన్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 2 నెలల వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం సీఐటీయూ నాయకులు స్థానిక డీఎంఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏవో శ్రీవాణికి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ... ఎన్‌హెచ్‌ఎం పరిధిలో పని చేస్తున్న అర్బన్ హెల్త్, ఏఎన్‌ఎం, స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గత 2 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఉద్యోగులందరికీ 2 నెలల వేతనం పీఆర్సీ, ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాజు, కోశాధికారి ఇమ్రాన్, ఉపాధ్యక్షుడు రాము, నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్యారేజ్ సిబ్బందికి శిక్షణ



ఆర్టీసీ గ్యారేజ్ సిబ్బందికి శిక్షణనిస్తున్న స్వామి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఆర్టీసీడిపోలో గ్యారేజ్ సిబ్బందికి గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. డిపో మేనేజర్ టి.స్వామి సిబ్బంది పలు సూచనలు సలహాలు అందించారు. మెరుగైన నిర్వహణ పద్ధతులు, సురక్షిత డ్రైవింగ్ కోసం అవసరమైన యాంత్రిక అవగాహన, వాటి నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ స్వామి మాట్లాడుతూ... శిక్షణ తరగతులు నైపుణ్యాలను పెంచేందుకు, సిబ్బంది పనితీరు మెరుగుపరిచేందుకు సహాయపడుతుందన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగన్నాథ రథయాత్ర

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథయాత్రను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇస్కాన్ ప్రతినిధులు శ్రీరామదాసు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మధ్యాహ్నం రెండు గంటలకు దుర్గమ్మ మందిరం నుంచి బయల్దేరి శాస్త్రిరోడ్, బస్టాండ్, సుభాష్‌రోడ్, గాంధీచౌక్ మీదుగా సాయంత్రం 6 గంటలకు బసవసేవా సదన్ చేరుతుందని తెలిపారు. భక్తులు జగన్నాథ రథాన్ని లాగి దర్శించుకోవాలని కోరారు. రాత్రి 10 గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేదన రగిలే... శోకం మిగిలే

శవమైనా దొరుకుతుందో లేదో..!

మార్చురీ వద్ద పడిగాపులు

- తమవారి కోసం బాధితుల ఆక్రందన
- నాలుగు రోజులైనా మారని పరిస్థితి

మనిషి ఎలాగూ ప్రాణాలతో దక్కలేదు ఆఖరి చూపుకోసం కనీసం తమవారి మృతదేహమైనా దొరుకుతుందో లేదోనన్న ఆందోళన సిగాచీ ఘటన బాధిత కుటుంబీకుల్లో వ్యక్తమవుతోంది. ప్రమాదం జరిగి నాలుగు రోజులవుతున్నా బాధిత కుటుంబాల్లో ఆవేదన అణుమాత్రం తగ్గలేదు. తమవారి మృతదేహాలను ఇస్తే తీసుక్కెళ్లేందుకు కళ్లల్లో ఒత్తులు వేసుకుని మరీ ఎదురుచూస్తున్నారు. ఇక ఆచూకీ తెలియని వారికోసం శవాగారం వద్ద నిద్రాహారాలు మాని ఆత్రతగా పడిగాపులు కాస్తున్నారు. మార్చురీ వద్ద ఎవరిని కదిలించినా మనిషిని కోల్పోయామన్న పుట్టెడు దుఃఖం వారిని నిలువెల్లా కంపించివేస్తోంది. గురువారం పటాన్ చెరు మార్చురీ వద్ద కనిపించిన దృశ్యాలు.

పటాన్‌చెరు/రామచంద్రాపురం(పటాన్‌చెరు)/పటాన్‌చెరు టౌన్: ఓవైపు ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం మరోవైపు తిండీతిప్పలు లేకుండా రోదనలతో మనోవేదనతో మార్చురీ వద్ద వారు ఎదురుచూస్తూ కనిపించడం అందరినీ కలచివేస్తోంది. డీఎన్‌ఏ పరీక్షలు తర్వాతనే మృతదేహాలను తీసుకువెళ్లే పరిస్థితి నెలకొంది. రక్త పరీక్షలు ఇచ్చి డీఎన్‌ఏ ఫలితాల కోసం కుటుంబీకులు ఇటు మార్చురీ వద్ద ఆటో హెల్త్ సెంటర్ వద్ద ఎదురుచూస్తున్నారు. ఎవరైనా వారిని పలకరిస్తే కన్నీటి పర్యంతమై గద్గద స్వరంతో తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. కనీసం తమవారి మృతదేహాలైనా దొరుకుతాయో లేదోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అల్లుడి మృతదేహం కోసం మామ



రాంజీ అవన్

ఉత్తరప్రదేశ్ చెందిన రాంజీ అవన్ తన అల్లుడు విజయ్‌కుమార్ కోసం మూడు రోజులుగా ఎదురు చూస్తున్నారు. తన కూతుర్ని రాంజీకి ఇచ్చి పెళ్లి చేశానని ఆయన సిగాచీలో పనిచేసేవాడని వివరించారు. అల్లుడి మృతదేహం లభిస్తే తీసుకువెళ్లాలని ఎదురుచూస్తున్నానని వివరించారు. అల్లుడు మృతదేహం కోసం తన ఇంటి వద్ద బంధువులందరూ ఎదురుచూస్తున్నారని వాపోయారు.



భర్తను కోల్పోయిన మహిళను ఓదారుస్తున్న కుటుంబ సభ్యురాలు



రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

లభించని సీనియర్ మేనేజర్ మృతదేహం



రవి (ఫైల్)

సిగాచీ పరిశ్రమల సీనియర్ మేనేజర్‌గా పనిచేసిన రవి మృతదేహం ఇంతవరకు లభించలేదు. మృతదేహం కోసం బంధువుల రోదనలు మిన్నంటుతున్నాయి. ఇస్నాపూర్‌లో స్థిరపడిన రవి కుటుంబం దుర్ఘటన జరిగినప్పట్నుంచీ ప్రతీరోజు మార్చురీ వద్దకు వచ్చి ఎదురుచూస్తున్నారు. రవి గతంలో ఈ పరిశ్రమలో పనిచేసి మానేసి మూడు నెలల క్రితమే చేరాడు.

డీఎన్‌ఏ ఫలితం కోసం ఎదురుచూపులు



గేటు వద్ద బాధితుల నిరసన



సంజు దేవి

సిగాచీలో పని చేసిన కార్మికుడు చోటేలాల్ కోల్ మృతదేహం కోసం ఆయన భార్య సంజు దేవి ఎదురు చూస్తున్నారు. తన భర్త కోసం ఆస్పత్రులు చుట్టూ తిరిగారు. 90% కాలిపోయిన ఒక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారనే వీడియోను చూసి అక్కడికి వెళ్లి చూసింది. కానీ, ఆమె ఆశ నిరాశే అయింది. ఆ వ్యక్తి ఆమె భర్త కాదని పోలీసులకు చెప్పింది. మార్చురీ వద్ద డీఎన్‌ఏ పరీక్షలు చేయించుకుని ఫలితాల కోసం రెండు రోజులుగా ఎదురుచూస్తోంది.

తనయుడి కోసం తల కొట్టుకుని..

కాళ్లు మొక్కుతా నా కొడుకు ఎక్కడ ఉన్నాడో చెప్పండి అని తండ్రి రాందాస్ పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమ ఎదుట తన తలను బండకు బాదుకున్నాడు. దీంతో వెంటనే పోలీసులు, వైద్య సిబ్బంది బాధితుడికి ప్రథమ చికిత్స చేశారు. తన కుమారుడి పేరు జస్టిన్ అని బండ్లగూడలో ఉంటామని తన కొడుకు సోమవారం ఉదయం డ్యూటీకి వచ్చాడని చెప్పాడు. పరిశ్రమలో ప్రమాదం జరిగిన రోజు నుంచి వెతుకుతున్నా కొడుకు ఆచూకీ మాత్రం దొరకడం లేదన్నారు. అధికారులు, నాయకులు తమ కుమారుడు ఎక్కడ ఉన్నాడో చెప్పాలని ఆయన కన్నీరు పెట్టుకున్నారు.



రాందాస్‌కు ప్రథమ చికిత్స చేస్తున్న వైద్యులు

డీఎన్‌ఏ ద్వారా 11 మంది గుర్తింపు

ఒకరిని బిహార్‌కు చెందిన కుటుంబ సభ్యులకు అప్పగింత

పటాన్‌చెరు టౌన్: సిగాచీ పరిశ్రమలో జరిగిన పేలుడు ప్రమాదంలో మరణించి గుర్తుపట్టలేని స్థితిలో పటాన్‌చెరు మార్చురీలో ఉన్న మృతదేహాలకు డీఎన్‌ఏ పరీక్షల ద్వారా 11 మందిని గుర్తించారు. డీఎన్‌ఏ పరీక్ష నివేదికలు వచ్చిన 11 మృతదేహాలకు సంబంధించిన కుటుంబ సభ్యులకు అధికారులు ఇప్పటికే సమాచారం అందించారు. అందులో బిహార్‌కు చెందిన పూజా కుమారికి తన భర్త నాగ పాశ్వాన్ (29) మృతదేహాన్ని గుర్తించి అప్పగించారు. అదేవిధంగా తక్షణ సహాయం కింద రూ.లక్ష అందజేశారు. నాగపాశ్వాన్ మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా బిహార్‌కు పంపించే ఏర్పాట్లు చేశారు.



మృతుడు నాగపాశ్వాన్ భార్య పూజ కుమారికి నగదును అందిస్తున్న ఆర్డీవో రాజు

ఉద్యాన పంటలు సాగు చేయాలి

జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరరావు

జహీరాబాద్: రైతులు ఉద్యాన పంటలను సాగు చేసుకుని లబ్ధి పొందాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరరావు సూచించారు. కోహీర్ మండలంలోని పిచరాగడి గ్రామంలో ఉద్యాన పంటల సాగుపై గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. అరటి, బొప్పాయి, అల్లం, ఆయిల్‌పామ్‌ను సాగు చేసుకున్న వారిని ప్రోత్సహించేందుకు సబ్సిడీ అందిస్తోందన్నారు. డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు వరప్రసాద్, శైలజ, దక్షిణ భారత నెటాఫిమ్ ఆగ్రోనమిస్ట్ ఎ.సుబ్బారావు, ఉద్యాన అధికారి సునీత, వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్‌లు ఉద్యాన పంటల సాగు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.



రైతులతో సమావేశమైన సోమేశ్వరరావు

కంటైనర్లలో అంగన్‌వాడీ కేంద్రాలు

- నిర్మాణం, డిజైన్ అంశాలపై అధ్యయనం
- తక్కువ వ్యయం ఎక్కువ సౌకర్యాలు

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అంగన్ వాడీ కేంద్రాలన్నింటికీ పక్కా భవనాలు నిర్మించనున్నారు. అయితే కొన్నిచోట్ల ఈ భవనాలకు బదులుగా కంటైనర్లతో డిజైన్‌చేసి అందులో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కంటైనర్లతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అవసరమైన అన్ని హంగులను అందులో కల్పించనున్నారు. కంటైనర్లతో డిజైన్ చేయించే అంశాన్ని అధ్యయనం చేయాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. వివిధ ప్రాంతాల్లో వివిధ రకాల కంటైనర్ కేంద్రాలను పరిశీలించనున్నారు.

వ్యయం తక్కువ

ప్రస్తుతం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కొన్నిచోట్ల సరైన వసతులు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. కంటైనర్లలో సోలార్ ప్లేట్లు బ్యాటరీ బ్యాకప్‌తో నూతన కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా సాగుతున్నారు. ఈ విధంగా చేస్తే తక్కువ వ్యయంతో అవసరమయ్యే అన్ని రకాల సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే చాలాచోట్ల కార్యాలయాలు, కౌంటర్లుగా కంటైనర్లను వినియోగిస్తున్న సంగతి తెలిసిందే.

వందరోజుల ప్రణాళిక

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో త్వరలో 100 రోజుల ప్రణాళిక రూపొందించి అమలు చేయనున్నారు. దీంతో కేంద్రాలలో పౌష్టికాహారం సరఫరా, పర్యవేక్షణ నిర్వహణ మరింత బలోపేతం కానుంది. సరైన వసతులు లేని కేంద్రాల్లో సమస్యలు పరిష్కారం కానున్నాయి.



పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని మరింత మెరుగుపరచనున్నారు. ఇప్పటికే బాలామృతం, పాలు, గుడ్లు తదితర వస్తువులు అందిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో జొన్న రొట్టెలను వినియోగిస్తున్న క్రమంలో పౌష్టికాహార నిపుణులతో చర్చించి, మహిళా సంఘాల సభ్యులతో ఇక్కడ కూడా పిల్లలకు అందించనున్నారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థల సేవలను కూడా ఇందుకోసం వినియోగించుకోనున్నారు. గర్భిణులు, బాలింతలు, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని బస్తీలు, వలస కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మొబైల్ అంగన్‌వాడీకేంద్రాలు ఏర్పాటు చేసి, వాహనాల ద్వారా పౌష్టికాహారం సరఫరా చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

మీసేవలో వివాహ రిజిస్ట్రేషన్

స్లాట్ బుకింగ్‌తో సర్టిఫికెట్లు పొందే సదుపాయం

- పారదర్శకంగా, వేగంగా సేవలు
- ఉమ్మడి జిల్లాలో 492 మీ సేవ కేంద్రాల్లో సదుపాయం

నారాయణఖేడ్: పాలనను ప్రజలకు చేరువ చేయడంతోపాటుగా పలు పథకాల అమలు తీరును మరింత పారదర్శకంగా, సులభతరంగా, వేగంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజలు తమ పనులకోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ సమయం వృథా చేసుకోవడం, ఇబ్బందులు పడటం లాంటి పరిస్థితులకు చరమగీతం పాడనుంది. అందులోభాగంగా మీసేవ కేంద్రాల్లో కొత్త సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే 12 రకాల నూతన సేవలు మీసేవ కేంద్రాల ద్వారా అందుబాటులోకి రాగా తాజాగా వివాహ రిజిస్ట్రేషన్ (మ్యారేజ్ రిజిస్ట్రేషన్), భూముల మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్స్‌ను పొందేందుకు అవకాశం కల్పించింది. వీటికోసం స్లాట్ బుకింగ్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది.

ఉమ్మడి జిల్లాలో 492 మీసేవ కేంద్రాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 492 మీసేవ కేంద్రాలు కొనసాగుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 174, సిద్దిపేటలో 236, మెదక్‌లో 82 కేంద్రాలు నడుస్తున్నాయి. ఈ కేంద్రాల్లో మున్సిపాలిటీ పరిధిలోని ఒక మీసేవ కేంద్రం ద్వారా నెలకు సుమారు వెయ్యి మంది, గ్రామీణ ప్రాంతాల్లో 200 నుంచి 300 మంది వరకు సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వం ఏదైనా కొత్త పథకాలను ప్రవేశపెట్టిన సందర్భాల్లో రాజీవ్ యువ వికాసం, రేషన్ కార్డులు వంటి సదుపాయాలు కల్పిస్తే ప్రజలకు అందే సేవల సంఖ్య మరింతగా పెరుగుతుంది.

వివాహ రిజిస్ట్రేషన్ ఇలా

కొత్తగా మీసేవల్లో అమలు చేస్తున్న మ్యారేజ్ సర్టిఫికెట్ జారీకి స్లాట్ బుకింగ్ విధానం అమలు చేస్తున్నారు. దరఖాస్తుదారులు పెళ్లి ఫొటోలు, చిరునామా రుజువు, వయస్సు ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఆమోదించిన అనంతరం సర్టిఫికెట్‌ను ప్రత్యక్షంగా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం జారీ చేస్తుంది.

మార్కెట్ వాల్యూసేవలు కూడా


మీసేవ కేంద్రం లేదా ఆన్‌లైన్‌లో జిల్లా, గ్రామం వంటి వివరాలను సమర్పించాలి. దీంతో భూమికి సంబంధించి తాజా మార్కెట్ వాల్యూ పొందవచ్చు.



కొత్తగా 12 రకాల సేవలు

ఇటీవల ప్రభుత్వం మీసేవ ద్వారా కొత్తగా 12 రకాల సేవలను అదనంగా అందుబాటులోకి తీసుకు వచ్చింది. మీసేవ ద్వారా రేషన్ కార్డుల దరఖాస్తు, మైనార్టీ సర్టిఫికెట్స్, ఎడ్యుకేషన్ గ్యాప్ సర్టిఫికెట్స్‌తోపాటు కొత్తగా వివాహ రిజిస్ట్రేషన్, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ సేవలు తదితరాలను అదనంగా అందుబాటులోకి తీసుకు వచ్చారు. మీసేవ ద్వారా ఆర్టీఏ, పాన్, ఇసుక బుకింగ్ వంటి సేవలు కూడా అందుతున్నాయి. భూమి, అపార్ట్‌మెంట్ విలువల అంచనాలను 24గంటల్లో ఆమోదించేలా చర్యలు చేపడుతున్నారు. ఇకపై టీ-ఫైబర్, అదనపు కియాస్క్‌లు కూడా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను మరింత దగ్గర చేస్తామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల వెల్లడించారు.

మీసేవ ద్వారా వివాహ రిజిస్ట్రేషన్ సేవలు



ఇటీవల ప్రభుత్వం ప్రారంభించిన వివాహ సర్టిఫికెట్, మార్కెట్ విలువ సర్టిఫికెట్‌లను స్లాట్ బుకింగ్ సేవలను మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలు వినియోగించుకోవచ్చు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రజల నుంచి అధిక రుసుము వసూలు చేయకుండా కేంద్రాన్ని నిబంధనల ప్రకారం నిర్వహించాలి. అధిక వసూళ్లు లేదా ఫేక్ సర్టిఫికెట్లను జారీ చేసినట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటాం.

- ఉదయ్‌కుమార్, ఈ- జిల్లా మేనేజర్, మీసేవ, సంగారెడ్డి

పర్యావరణహిత ఇటుకల తయారీ

ప్రదర్శించిన విద్యార్థులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ పర్యవేక్షణలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణహిత ఇటుక (ఎకో బ్రిక్స్)లను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామకృష్ణ మాట్లాడుతూ..ప్రపంచాన్ని పీడిస్తున్న పర్యావరణ సమస్యల్లో ప్లాస్టిక్ కాలుష్యం ఒకటన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడంతోపాటు ప్లాస్టిక్ చెత్త రీసైక్లింగ్, కంపోస్ట్ ఎరువుపై ప్రజల్లో చైతన్యం కల్పించటమే ఈ ప్రదర్శన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవనీత, సునీత పాల్గొన్నారు.



ఎకో బ్రిక్స్ ప్రదర్శిస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

క్లుప్తంగా

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య



సఖి కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న సౌజన్య

సంగారెడ్డి టౌన్: విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని శిశు, గృహ సఖి కేంద్రాలలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పిల్లలకు చిన్నప్పట్నుంచే క్రమశిక్షణను నేర్పించాలన్నారు. వారిని ఉన్నత చదువులు చదివించాలని, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని వివరించారు. అనంతరం సఖీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూరీ జగన్నాథ్ రథయాత్ర


జగన్నాథ్ రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీకాలనీ, విద్యాభారతి పాఠశాల ఆవరణలో జరిగిన పూరీజగన్నాథ్ రథయాత్రలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కార్పొరేటర్ సింధూరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుని భవిష్యత్తు తరాల వారికి అందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు.

వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచాలి

జహీరాబాద్ టౌన్: వర్షకాలం నేపథ్యంలో వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ.సృజన్ చక్రవర్తి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని శేఖాపూర్, ఆనేగుంట, మల్‌చెల్మ తదితర గ్రామాల్లో గురువారం పర్యటించి వాటర్ ట్యాంక్, పైపులను పరిశీలించారు. వర్షపు నీటి ద్వారా ట్యాంకులు కలుషితమయ్యే అవకాశముందని వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తవని వివరించారు. పైపు లైన్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు

సిద్దిపేటకమాన్: కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన మహిళను పోలీసులు కాపాడారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... పట్టణంలోని కరీంనగర్ రోడ్డు వడ్డెర కాలనీలో శివరాత్రి కనకవ్వ భర్త శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. కనకవ్వ కుటుంబ సమస్యలతో బాధపడుతూ మనస్తాపానికి గురై ఇంట్లో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్ ద్వారా హైదరాబాద్‌లో ఉన్న తన కూతురుకు చెప్పింది. వెంటనే ఈ విషయాన్ని ఆమె పట్టణంలోని తమ బంధువులకు తెలపడంతో వారు పోలీసులకు తెలిపారు. దీంతో సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో పోలీసులు బాధితురాలి ఫోన్ నంబర్ ద్వారా లొకేషన్ కనుగొని ఇంటికి వచ్చారు. లోపలి నుంచి గడియ పెట్టుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్న మహిళను పోలీసులు, కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి ఆమెను కాపాడారు. పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గుంతల రోడ్లతో ఇబ్బందులు


రోడ్లను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుస్నాబాద్: పట్టణంలోని పలు వార్డుల్లో గుంతల రోడ్లు పూడ్చకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్‌ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో పలు వార్డుల్లో గుంతల రోడ్లను గురువారం పరిశీలించారు. పట్టణంలో రహదారులు గుంతలు పడినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. మిషన్ భగీరథ పైపులైన్ల కోసం తవ్విన రోడ్లను పూడ్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 వార్డులల్లో రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి వార్డుకు రూ.50 లక్షల చొప్పున మంత్రి పొన్నం ప్రభాకర్ నిధులు మంజూరు చేశారని, కొన్ని వార్డుల్లో పనులు ప్రారంభించలేదన్నారు. అధికారులు గుంతల రోడ్లను పూడ్చి, వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు వికాస్ యాదవ్, సదానందం, జగ్జీవన్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ సెల్‌ఫోన్స్!

స్నాచర్లు, పిక్ ప్యాకెటర్ల కళ్లు వీటిపైనే

- ఏటా వేల సంఖ్యలో ఫోన్ల గల్లంతు
- బల్కంపేట ఎల్లమ్మ ఉత్సవాల్లో పంజా
- 12 గంటల్లో 19 నేరాలు చేసిన ముఠాలు
- వీటిలో 13 ఉదంతాలు ఫోన్ల తస్కరణవే



సాక్షి, హైదరాబాద్: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం జరిగిన బుధవారం జేబుదొంగలు రెచ్చిపోయారు. భక్తుల మాదిరిగానే తిరుగుతూ క్యూలైన్లు, ప్రవేశ ద్వారాల వద్ద చేతివాటం చూపించారు. కేవలం 12 గంటల్లో మొత్తం 19 కేసులు నమోదు కాగా... వీటిలో 13 సెల్‌ఫోన్ చోరీలకు సంబంధించినవే కావడం గమనార్హం. కేవలం ఈ ఒక్క సందర్భంలోనే కాదు... గడిచిన కొన్నాళ్లుగా నగరంలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ పరిణామాలను పరిశీలిస్తున్న పోలీసులు ప్రస్తుతం పిక్‌పాకెటర్ల కన్ను సెల్‌ఫోన్లపై ఉన్నట్లు చెబుతున్నారు.

అంతటా ఇవే నేరాలు..

రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నా, రద్దీ బస్సులో ప్రయాణిస్తున్నా, మార్కెట్‌కు వెళ్లినా, సభలు, ఉత్సవాలకు హాజరైనా అక్కడ పొంచి ఉంటున్న చోరులు స్మార్ట్ ఫోన్లను స్వాహా చేస్తున్నారు. చదువుకున్న యువత, జల్సాలకు అలవాటుపడిన వాళ్లు సైతం 'జాయ్ స్నాచర్ల'గా మారి పోలీసులకు కొత్త సవాల్ విసురుతున్నారు. అధికారిక, అనధికారిక సమాచారం ప్రకారం నగరంలో ఏటా దాదాపు 50 వేల వరకు సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. రాజధాని నగరంలో అనేక ఛోటామోటా ముఠాలు సెల్‌ఫోన్ పిక్‌పాకెటింగ్, స్నాచింగ్‌ను వ్యవస్థీకృతంగా చేస్తున్నాయి. బస్సు ప్రయాణికులు, పాదచారులతో పాటు రద్దీ ప్రాంతాల్లోని వాళ్లే లక్ష్యంగా చేసుకుని ఈ సెల్‌ఫోన్ నేరం అనేది కొనసాగుతోంది. వీరిబారిన పడే వారిలో మధ్య తరగతి వారే ఎక్కువగా ఉంటున్నారు.

పర్సులు, గొలుసుల నుంచి సెల్‌ఫోన్ల వైపు..

నగరంలోని పిక్ ప్యాకెటింగ్ గ్యాంగ్‌లు ఒకప్పుడు కేవలం పర్సుల్ని మాత్రమే టార్గెట్ చేసేవి. అయితే.. ప్లాస్టిక్ కరెన్సీగా పిలిచే క్రెడిట్, డెబిట్ కార్డుల వినియోగం పెరిగిన తర్వాత వీరి పంథా మారింది. గతంలో చైన్ స్నాచింగ్ గ్యాంగ్స్ వరుసపెట్టి పంజా విసిరాయి. ఎక్కడికక్కడ ఆడా, మగా అని తేడా లేకుండా గొలుసులు తెంచుకుపోయాయి. అయితే.. ఇటీవల పిక్ ప్యాకెటర్లు పర్సుల్ని, స్నాచర్లు గొలుసుల్ని వదిలేసి సెల్‌ఫోన్లపై పడ్డారు. కొందరు ఈజీ మనీకి అలవాటుపడి వరుసపెట్టి నేరాలు చేస్తున్నారు. వ్యవస్థీకృతం కాని, నేరం చేయాల్సి అవసరం లేని.. సరదా కోసం చేస్తున్న వారి సంఖ్యా ఇటీవల పెరుగుతోంది. ఈ నేరగాళ్లు సరదా కోసం సెల్‌ఫోన్లు లాక్కుపోతూ స్నాచింగ్, దోపిడీ కేసుల్లో నిందితులుగా మారుతున్నారని పోలీసులు చెబుతున్నారు.

కొన్నిసార్లు ఇన్సూరెన్స్ క్లెయిమ్‌కి ఇబ్బందే..

ఓ బాధితుడు పోలీసులకు ఆశ్రయించి ఎలాంటి ఫిర్యాదు చేసినా దాన్ని జీడీ ఎంట్రీ చేసి... ఆపై ఎఫ్ఐఆర్‌గా రిజిస్టర్ చేయాలి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం దీనికి న్యాయపరమైన సలహాలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం పోలీసులు దీన్ని పూర్తిగా అమలు చేయట్లేదు. ముఖ్యంగా జేబు దొంగతనాలు, స్నాచింగ్స్, సెల్‌ఫోన్ చోరీలు, వాహనాల దొంగతనాలకు సంబంధించిన కేసులు త్వరగా పరిష్కారం కావని, పెండింగ్ పెరుగుతుందనే ఉద్దేశంతో వీటిని చాలా వరకు ఎఫ్ఐఆర్ చేయట్లేదు. కేవలం జనరల్ డైరీ (జీడీ) ఎంట్రీతో సరిపెడుతున్నారు. ఈసీఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఆ ఫోన్ ఖరీదు చేసినప్పటి బిల్లు తదితరాలు లేకపోతే ఈ ఫిర్యాదు సాధ్యం కావట్లేదు. ఇలాంటి సందర్భాల్లో, ఆ ఫోన్ రికవరీ కానప్పుడు బాధితులు నష్టపోతున్నారు.

సినిమా టెక్నాలజీపై అవగాహన


విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలలో గురువారం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కోర్సులు, సినిమా టెక్నాలజీపై అవగాహన కల్పించారు. సంస్థ ప్రతినిధులు విశ్వనాథం, రాము మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లక్ష్యం ఏర్పరుచుకుని ఆ దిశగా కష్టపడి ఉన్నతులుగా ఎదగాలన్నారు. విద్య వికాసాన్ని అందిస్తుందని, విద్యార్థులు ఇంటర్ తరువాత ఆసక్తిగలరంగాన్ని ఎంచుకుని అందులో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సతీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయబద్ధంగా పరిహారం ఇవ్వాలి

ఆర్డీఓకు భూనిర్వాసితుల వినతి


ఆర్డీఓకు వినతిపత్రాన్ని ఇస్తున్న భూనిర్వాసితులు

సిద్దిపేటజోన్: రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు న్యాయబద్ధమైన నష్టపరిహారం చెల్లించాలని బాధితులు ఆర్డీఓ సదానందానికి విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్– సిద్దిపేట మార్గంలో రైల్వేట్రాక్ వద్ద బ్రిడ్జికి ఇరువైపులా భూములు కోల్పోతున్న మిట్టపల్లికి చెందిన పలువురు బాధితులు గురువారం ఆర్డీఓ కార్యాలయానికి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మిట్టపల్లి పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమకు కనీస సమాచారం ఇవ్వకుండా తమతో చర్చించకుండా రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో కోల్పోతున్న భూములకు అవార్డు ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. బాధితులకు సరైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మిట్టపల్లి మాజీ ఉప సర్పంచ్ సంపత్ యాదవ్, భూనిర్వాసితులు శ్రీనివాస్, మల్లేశం, రఫీ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహిపాల్ తదితరులు

పోస్టర్ ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను మహీంద్ర టెక్నీషియన్ కాలనీలో గురువారం సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కన్వీనర్ మహిపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. పోరాటాల వల్ల సాధించుకున్న కార్మిక చట్టాలను తీసేస్తుందన్నారు. సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహీంద్ర అండ్ మహీంద్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి కనకారెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఎంపీ రఘునందన్‌రావు


ప్రవీణ్‌కు చెక్కును అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

వర్గల్(గజ్వేల్): కార్యకర్తలకు అండగా ఉంటూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు వారిలో మనోధైర్యాన్ని నింపుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మైలారం గ్రామానికి చెందిన ప్రవీణ్ కొడుకు నిమోనియాతో ఇటీవల ఆసుపత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న ఎంపీ రఘునందన్‌రావు ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గురువారం మంజూరైన రూ.3.50 లక్షల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

సబ్సిడీపై కంది విత్తనాల పంపిణీ


కంది విత్తనాలను అందజేస్తున్న వెంకట్రావమ్మ, మెరుగు కృష్ణ

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాల రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ, పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణతో కలసి గురువారం రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 100 శాతం సబ్సిడీపై పీఆర్‌జీ 176 రకాన్ని అందిస్తున్నాయన్నారు. దేశంలో పప్పుదినుల సాగు చేయడానికి ప్రభుత్వాలు పోత్సహిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ అధికారులు రవళి, భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సింగూరులో జల విద్యుత్ ప్రారంభం

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టులో జల విద్యుత్ కేంద్రంలో గురువారం విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. దిగువన మంజీరా డ్యాంక్ తాగునీరు ఏడుపాయల వద్ద నున్న ఘనపూర్ ఆయకట్టుకు సాగునీరు అవసరం దృష్ట్యా సింగూరులో విద్యుత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం సింగూరు డ్యాంలో 19 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

పది అడుగుల కొండ చిలువ


సదాశివపేట పట్టణం సిద్దాపూర్ హౌసింగ్ బోర్డు సమీపంలోని ఎకోవ్యాలీ వెంచర్ గోడ వద్ద దొరికిన 10 అడుగుల కొండచిలువ

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణ పరిధిలోని సిద్దాపూర్ హౌసింగ్‌బోర్డు సమీపంలోని ఎకోవ్యాలీ వెంచర్ ప్రహరీకి ఆనుకున్న ప్రాంతంలో గురువారం సాయంత్రం పది అడుగుల పొడవైన భారీ కొండ చిలువ లభ్యమైంది. ప్రహరీ నుంచి చిన్నచిన్న పాములు వస్తుండటాన్ని చూసిన స్థానికులు అక్కడకు వెళ్లగా పెద్ద కొండ చిలువ ఉండటాన్ని గమనించారు. ఎకోవ్యాలీ వెంచర్ నిర్వాహకుడు ఇలియాస్‌షరీఫ్ వెంటనే ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో పాములు పట్టేపనిచేస్తున్న కొండాపూర్ మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన సద్దామ్‌కు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న సద్దామ్ వెంటనే వాటర్ ట్యాంకర్ తెప్పించి కొండచిలువ పడుకున్న ప్రాంతంలో నీళ్లు పోయడంతో అది బయటకు వచ్చింది. దీంతో దాన్ని పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేందుకు తీసుకెళ్లారు.

రోడ్ల మరమ్మతుకు రూ.50 కోట్లు

ఎమ్మెల్యే సంజీవరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలో పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖకు సంబంధించిన పలు రోడ్లకు మరమ్మతులు, తారు రెన్యూవల్ పనుల కోసం రూ.50 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి వెల్లడించారు. క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ... ఖేడ్–నాగల్‌గిద్ద–కరసుత్తి, ఖేడ్– రాయిపల్లి, మాసానిపల్లి–కల్హేర్ రోడ్ల మరమ్మతులకు రూ.50లక్షల చొప్పున మంజూరు కాగా పదిరోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయన్నారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట్ భవానీమందిరం నుంచి శివాజీ చౌక్ వరకు సీసీరోడ్డు, రోడ్డుపక్కన విశాలమైన మురుగుకాల్వల నిర్మాణం కోసం రూ.15 కోట్లు మంజూరయ్యాయన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, తండాలకు రోడ్ల కోసం రూ.25 కోట్లు మంజూరుకాగా అందులో టి.లింగంపల్లి నుంచి బోరంచ మీదుగా బెల్లాపూర్‌లోని జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ రెండు వరుసల రోడ్డుతోపాటు ఖేడ్ నుంచి పంచగామ, రాణాపూర్‌ల మీదుగా తుమ్నూరు వరకు తారు రోడ్డు ఉందని తెలిపారు. రోడ్లులేని 12 తండాలకు తారురోడ్ల కోసం ఎస్టీ ఎస్డీఎఫ్ కింద రూ.12.50 కోట్లతో ప్రతిపాదనలు పంపామని వివరించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్‌పాటిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్, రమేశ్ చౌహాన్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు


నారాయణఖేడ్: బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తున్న డీఆర్పీ నర్సప్ప

నారాయణఖేడ్: ఓటర్ల వివరాలపై బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించాలని డీఆర్పీలు నర్సప్ప, భూమయ్యలు సూచించారు. ఖేడ్ నియోజకవర్గంలోని బీఎల్‌వోలకు బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణా తరగతులను గురువారం ప్రారంభించారు. 18 ఏళ్లు నిండిన అందరి పేర్లు ఓటరు జాబితాలో ఉండాలని సూచించారు. కొత్తగా నమోదు చేసుకునేందుకు ఫారం 6ను అందజేయాలన్నారు. మరణించిన వారిపేర్లను ఫారం 7ద్వారా తొలగించాలని తెలిపారు. మార్పుచేర్పులకు ఫారం 8ను అందించాలని చెప్పారు. బీఎల్‌వో యాప్‌గూర్చి శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాబేగం, డిప్యూటీ తహసీల్దార్ రాజు, ఆర్ఐ మాధవరెడ్డి పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో...

జహీరాబాద్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. జహీరాబాద్‌లోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోహీర్ మండలానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బందికి శిక్షణనిచ్చారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా తరగతులలో ఒక్కో మండలానికి ఒక్కో రోజు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వరప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన మంత్రికి లక్ష పోస్ట్‌కార్డులు పంపిస్తాం


పోస్ట్ కార్డులు చూపుతున్న పరశురామ్ తదితరులు

దుబ్బాకటౌన్: కరెన్సీనోట్లపై ఆర్బీఐ స్ఫూర్తి ప్రదాత డా. బీఆర్ అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డా.పరశురామ్ డిమాండ్ చేశారు. రాయపోల్ అంబేడ్కర్ చౌరస్తాలో లక్ష పోస్ట్ కార్డుల ఉద్యమంలో భాగంగా నాయకులు గురువారం ప్రధాన మంత్రి మోదీకి పోస్ట్ కార్డులు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1935 ఏప్రిల్ 1 రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఏర్పడిందన్నారు. అంబేడ్కర్ లేకుంటే ఆర్బీఐ లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా 500 మందితో పోస్ట్ కార్డులు పోస్ట్ బాక్స్‌లో వేశామని చెప్పారు. జాతీయ జెండా రూపాకల్పన కమిటీ, జాతీయ జెండాలో అశోక చక్రం ఏర్పాటు చేసిన రోజు జూన్ 23 నుంచి 26 జనవరి 2026 వరకు దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లక్ష మందితో పోస్ట్ కార్డ్ ఉద్యమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాములు, రవి, ప్రశాంత్, ప్రకాశ్, రాజు, రాములు, పోచయ్య, సాయిలు, నర్సయ్య తదితరులున్నారు.


బురదమయంగా మారిన బస్టాండ్‌కు వెళ్లే దారి

దారి ఇలా.. బస్టాండ్‌కు వెళ్లేదెలా..

దుబ్బాక నూతన బస్టాండ్‌లోనికి వెళ్లాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే ప్రధాన దారి గుంతలుగా మారి బురద నీటితో నిండిపోయింది. దీంతో ప్రయాణికులు లోపలికి వెళ్లాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది బురదలో జారి పడి ప్రమాదాల పాలవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. – దుబ్బాకటౌన్

సమ్మెను విజయవంతం చేయండి

- సీఐటీయూ కమిటీ సభ్యుడు రాజయ్య
- వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న రాజయ్య

జిన్నారం (పటాన్‌చెరు): ఈనెల తొమ్మిదిన జరగబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య పేర్కొన్నారు. గురువారం బొల్లారంలో ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మె వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశ ప్రధాని నరేంద్ర మోదీ కార్మికుల శ్రమను దోచుకునేందుకు నాలుగు నూతన లేబర్ కోట్లను అమలు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఈ లేబర్ కోట్లు అమల్లోకి వస్తే కార్మిక లోకం వెట్టి చాకిరికి గురవుతుందని ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ లేబర్ కోట్లను పొందుపరిచారున్నారు. పీఎఫ్ ఈఎస్ఐ బోనస్లు కార్మికులకు అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేందర్ రెడ్డి, గుట్టయ్య, రామకృష్ణ, సుజాత, విజయ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో కస్తూర్బాగాంధీ



తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల

మునిపల్లి(అందోల్): తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యాభివృద్ధిలో ముందుకు సాగుతోంది. 2011లో ప్రారంభంలో 6,7,8,9వ తరగతి వరకు కొనసాగింది. 2014–15లో పదవ తరగతి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పదిలో వందకు వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రస్తుతం పదవ తరగతిలో 40 మంది విద్యార్థినులు చదువుతున్నారు. 2025 జూన్‌లో ఒకేషనల్ ఇంటర్మీడియట్ (ఎంఎల్‌టీ)మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ కోర్స్ ప్రారంభించారు. ప్రభుత్వం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు నెలకు నాలుగు సార్లు చికెన్, రెండు సార్లు మటన్‌తో పాటు నాణ్యమైన భోజనం, స్పెషల్ క్లాస్‌లను అధ్యాపక బృందం నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని చదువులో ముందుండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తరగతులకు సరిపడ అధ్యాపకులను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

చీట్ ఫండ్
డిపాజిట్ చేసి మోసపోయిన బాధితుడు


బాధితుడు షబ్బీర్

మెదక్‌జోన్: చిట్‌ఫండ్ కంపెనీల్లో సామాన్యులు డిపాజిట్లు చేసి మోసాలకు గురవుతున్నారు. జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా సమీపంలో కొందరు ఆదర్శ్ క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో చిట్‌ఫండ్ కంపెనీ పెట్టారు. అయితే హవేళిఘనాపూర్ మండలం సర్ధన గ్రామానికి చెందిన కటికె షబ్బీర్ 2019లో తన చెల్లెలు నశ్రీన్ పేరుపై ఈ కంపెనీలో రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాడు. 10 సంవత్సరాలు అంటే 2029 నాటికి రూ.1,85,361 అవుతుందని నిర్వాహకులు చెప్పడంతో నమ్మాడు. కానీ 2020లో కంపెనీని మూసేసి ఉడాయించారని ఆలస్యంగా తెలుసుకున్న బాధితుడు లబోదిబోమన్నాడు. చిట్‌ఫండ్ మోసాలపై తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : తపస్


సభ్యత్వ నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

వెల్దుర్తి(తూప్రాన్): జీఓ 317 వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు వెంటనే న్యాయం చేయాలని తపస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి దుబాషి భాస్కర్, జిల్లా బాధ్యులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు చేపట్టి, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల్లో ఆర్థిక భారం లేని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోచయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు నిందితుల రిమాండ్

నంగునూరు(సిద్దిపేట): పేషీలకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను గురువారం కోర్టులో హాజరు పరచగా కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ అసీఫ్ వివరాల మేరకు... నంగునూరు మండలం ఘణపూర్‌కు చెందిన బోడ తిరుపతిరెడ్డిపై 2019లో, అలాగే మద్దూర్ మండలం బెక్కల్‌కు చెందిన ఆరే ఉప్పలయ్యపై రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితులు కోర్టు పేషీలకు హాజరు కాకుండా తిరుగుతున్నారు. కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరిని కరీంనగర్‌లోని జిల్లా జైలుకు తరలించారు.

నూతన టెక్నాలజీపై శిక్షణ ఇవ్వాలి

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వం టూ వీలర్ మెకానిక్‌లకు నూతన టెక్నాలజీపై శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని ఆ సంఘం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో గజ్వేల్ టూ వీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డితో కలిసి టూ వీలర్స్ అసోసియేషన్ పతాకం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్ అధ్యక్షుడు అనిల్, మాజీ అధ్యక్షులు ధన్‌రాజ్ సింగ్, వెంకటేష్, ముఖ్య సలహాదారు నర్సింలు, సభ్యులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌కు స్వల్ప గాయాలు

అల్లాదుర్గం(మెదక్): సబ్ రిజిస్ట్రార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామ శివారులో 161 జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. వివరాలు... హైదరాబాద్ మహిదీపట్నంకు చెందిన మహ్మద్ నిజామొద్దీన్ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకుని ఇంటికి కారులో వెళ్తుండగా ముస్లాపూర్ వద్ద అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. దీంతో ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఆయనకు స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించారు.

కార్మికుల ఆస్పత్రికి సుస్తీ

- సమస్యల సుడిగుండంలో డిస్పెన్సరీలు
- మందుల జాడ కరువు
- బీడీ కార్మికులకు అందని వైద్యం
- స్పందించని అధికార యంత్రాంగం

జిల్లాలో ప్రహసనంగా కార్మిక వైద్యం



సిద్దిపేట పట్టణంలో డిస్పెన్సరీ, ఆస్పత్రిలో ఉన్న మందులు

సిద్దిపేటజోన్: బీడీ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఆస్పత్రులు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం పరిశ్రమలపై ఆధారపడి ఉన్న కార్మికుల సంఖ్య 60వేలు కాగా, అనధికారికంగా వీరికి మూడింతలున్నట్లు వినికిడి. బీడీ పరిశ్రమలో పనిచేసే కార్మికుల కోసం అనారోగ్య సమస్యలు వస్తే వైద్యం కోసం కేంద్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఆస్పత్రులు(డిస్పెన్సరీ)లు ఏర్పాటు చేసింది. అరకొరగా మందులు, సిబ్బంది ఖాళీలు, మూలనపడ్డ అంబులెన్స్, గ్రామాల్లో కానరాని వైద్య శిబిరాలు వెరసి కార్మిక వైద్యం గాడితప్పుతోంది.

జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, నియోజకవర్గ పరిధిలోని అత్యధిక గ్రామాల్లో బీడీ కార్మికులు ఉన్నారు. ఆయా ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలకు సంబంధించిన కార్ఖానాల్లో జిల్లాలో లక్ష పైచిలుకు మహిళా బీడీ కార్మికులు పని చేస్తున్నారు. నిత్యం బీడీ చుట్టే క్రమంలో తంబాకు ప్రభావం వల్ల మహిళలు అనారోగ్యం బారినపడే ప్రమాదాలు ఉన్నాయి. ముఖ్యంగా శ్వాస సంబంధిత వ్యాధులు క్షయ, దగ్గు దమ్ము, ఆస్తమా లాంటి వాటిన పడి బాధపడుతున్నారు. వీరికి ఉచితంగా వైద్యం అందించే క్రమంలో సిద్దిపేట, దుబ్బాక ప్రాంతాల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేశారు.

మందులు, సిబ్బంది కొరత

డిస్పెన్సరీలో అవసరమైన మందులు ఉండటం లేదు. జ్వరం, కీళ్ల నొప్పులు, దగ్గు, లాంటి రోగాల మందులు మాత్రమే ఉన్నాయనే ఆరోపణలున్నాయి. మరోవైపు మందులు ఇచ్చే ఫార్మాసిస్ట్ పోస్టుతోపాటు పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏడు పోస్టులకు గాను ముగ్గురు మాత్రమే ఉన్నారు. దీంతో ఇక్కడి వైద్యురాలిపై అదనపు పనిభారం పడుతోంది. దుబ్బాకలోనూ ఇదే పరిస్థితి. ఉన్న వైద్యుడు రెండు రోజుల పాటు డిప్యుటేషన్‌పై ముస్తాబాద్ వెళ్లడంతో నాలుగు రోజులే అందుబాటులో ఉంటున్నాడు. ఉన్న ఒక ఫార్మాసిస్ట్ సిద్దిపేట నుంచి డిప్యుటేషన్ పైవచ్చి పనిచేస్తున్నాడు. పదవీ విరమణ జరుగుతున్న నియామకం లేకపోవడంతో కార్మిక ఆస్పత్రుల్లో ఖాళీల ప్రభావం వైద్యంపై పడుతోంది.

పత్తా లేని వైద్య శిబిరాలు

బీడీ కార్మికులకు మొబైల్ వైద్య సేవలు పత్తా లేకుండా పోయాయి. సిద్దిపేట, దుబ్బాక డిస్పెన్సరీ పరిధిలోని గ్రామాల్లో షెడ్యూల్ మేరకు అంబులెన్స్ ద్వారా వైద్య సేవలు అందించాలి. కొన్నేళ్లుగా వైద్య శిబిరాల జాడ లేదు. డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉండటంతో సిద్దిపేట ఆస్పత్రిలో అంబులెన్స్ మూలన పడింది. ఆయా డిస్పెన్సరీల్లో నెలకొన్న సమస్యలపై డాక్టర్ లక్ష్మీప్రసన్న వివరణ కోరగా.. సిద్దిపేట ఆస్పత్రిలోని సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేశానని తెలిపారు. నియామకాలు లేకపోవడంతో ఖాళీల సమస్య ఉందన్నారు. పురాతన వాహనం, డ్రైవర్ పోస్ట్ ఖాళీ వల్ల మొబైల్ క్యాంపు ఏర్పాటు సమస్యగా మారిందన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



జిల్లాలో బీడీ పరిశ్రమపై వేలాది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. వారి వేతనం నుంచి ఈఎస్‌ఐ పేరిట వైద్యం కోసం డబ్బులు కట్ చేస్తున్నారు. బీడీ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి. వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చూడాలి. మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీహరి.(టీబీబీకే ఎస్ జిల్లా అధ్యక్షుడు)

మొబైల్ క్యాంపు ఏర్పాటు చేయాలి



జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఉన్న బీడీ మహిళా కార్మికుల కోసం మొబైల్ క్యాంపులను యథావిధిగా కొనసాగించాలి. అవసరమైన అంబులెన్స్ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలి. వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలి.

–మల్లేశం(హెచ్‌ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు)


శిక్షణ సందర్భంగా రైతులతో శాస్త్రవేత్తలు

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

రైతుల శిక్షణలో సైంటిస్ట్ డాక్టర్ ఎం.బాలకృష్ణ

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రకృతి వ్యవసాయంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎన్‌ఏఏఆర్ఎం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.బాలకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఎస్సీ రైతులకు ప్రకృతి, సేంద్రియ వ్యసాయంపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌ఏఏఆర్ఎం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రసాయన ఎరువుల వాడకం పెరిగిందని, దీంతో భూసారం తగ్గుతుందని తెలిపారు. రైతులు తప్పనిసరిగా ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచించారు. పశువులు, కోళ్ల ఎరువుతోపాటు జీవామృతం, బీజామృతం ఎరువులుగా వాడాలన్నారు. కార్యక్రమంలో కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ, నల్కర్ కేవీకే శాస్త్రవేత్తలు రవికుమార్, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్, ఉదయ్‌కుమార్, భార్గవితోపాటు రాయిలాపూర్, తునికి, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 40మంది ఎస్సీ రైతులు పాల్గొన్నారు.

చిరుత పులి అలజడి

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలో చిరుత పులి సంచారం కలంకలం రేపింది. గురువారం కృష్ణాపూర్ శివారులో పాదముద్రలు వెలుగుచూశాయి. కొంత కాలంగా కృష్ణాపూర్, ఖానాపూర్(కె), బీబీపేట్, రాపర్తి, నాగధర్, కడ్పల్, తదితర ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తోంది. నల్లవాగు కాల్వ పక్కన పాదముద్రలు కనిపించడంతో కాంట్రాక్టర్ నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. డీఈఈ పవన్‌కుమార్, ఇరిగేషన్ అధికారులు పాదముద్రలు పరిశీలించి అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. చిరుత సంచారంతో ప్రజలు భయందోళన చెందుతున్నారు.


కృష్ణాపూర్ శివారులో చిరుత పులి పాదముద్రలు


బయో పాండ్‌లో చేపపిల్లలను వదులుతున్న ప్రిన్సిపాల్

బయో పాండ్‌లో చేపపిల్లల విడుదల

సిద్దిపేట జోన్ : పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జంతుశాస్త్ర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బయో పాండ్‌లో 1500 చేపపిల్లలు వదిలినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సునీత తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న ఫిషరీస్, జంతుశాస్త్ర విద్యార్థులకు చిన్ననీటి వనరులలో చేపల పెంపకంపై అవగాహన కల్పిస్తామన్నారు. చేపలకు సరైన ఆహారం అందిస్తూ, వ్యాధుల నుంచి రక్షించడానికి అవసరమైన పద్ధతులను తెలుపుతూ అధిక రాబడి వచ్చే విధంగా అన్ని విషయాలను విద్యార్థులకు తెలుపుతామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.ఎం.మధుసూదన్‌రెడ్డి, డా. జగదీశ్వరాచారి, రామ్‌కుమార్, చక్రవర్తి, వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నగదు, నగలు అపహరణ

తూప్రాన్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం... పట్టణంలోని మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా నివాసం ఉంటున్న కిచెన్‌గారి కృష్ణ కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని రూ.లక్ష నగదు, అర తులం బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించారు. కాగా బాధితులు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.


ఇంట్లో బీరువాను పగులగొట్టిన దొంగలు

రోడ్డు ప్రమాదంలో ఎస్సై దుర్మరణం

కంది మండలం చేర్యాల గేటు వద్ద ఘటన


ఎస్సై రాజేశ్వర్

కంది(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ఎస్సై దుర్మరణం చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వర్ రావు(54) సంగారెడ్డి పట్టణంలోని చాణిక్యపురి కాలనీలో నివాసం ఉంటున్నాడు. మూడు రోజులుగా బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విధులు ముగించుకొని బుధవారం రాత్రి సంగారెడ్డికి కారులో బయలు దేరాడు. ఈ క్రమంలో కంది మండలం చేర్యాల గేటు వద్ద జాతీయ రహదారిపై రాజేశ్వర్ కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎస్‌ఐని చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

ఎస్సై కుటుంబంలో తీవ్ర విషాదం

ఎస్సై మృతితో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతునికి భార్య గాయత్రి తోపాటు ఓ కుమారుడు, కుమార్తె ఉంది. ఆరు నెలల క్రితం ఎస్సైగా ప్రమోషన్ పొందిన రాజేశ్వర్ ఫిలింనగర్‌కు వారం రోజుల క్రితమే బదిలీపై వెళ్లారు. కొత్త పోస్టింగ్‌లో చేరిన కొన్ని రోజులకే ఎస్సై మృతి చెందడం తోటి సిబ్బందిని కలచివేసింది. ఎస్సై అంత్యక్రియల్లో అదనపు ఎస్పీ సంజీవ రావు, డీఎస్పీ సత్తయ్య గౌడ్, సీఐలు క్రాంతి కుమార్, రమేష్, సంతోష్‌తోపాటు రూరల్ ఎస్సై రవీందర్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ జెంపర్ సరిచేస్తుండగా..

విద్యుదాఘాతంతో రైతు మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యుదాఘాదంతో రైతు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండలంలోని భుజిరంపేట పీర్యతండా పంచాయతీ మన్యతండాలో గురువారం జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం... మన్యతండాకు చెందిన రైతు పాత్‌లోత్ బన్సీ (బన్సీలాల్)(38) గురువారం ఉదయం కూకట్లపల్లి శివారులోని తన పొలంలో వరి నారుకు మందు పిచికారీ చేస్తుండగా నీళ్లు లేకపోవడంతో బోరు మోటార్‌ను ఆన్ చేశాడు. అది నడవకపోడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జెంపర్ సరిచేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయా డు. గమనించిన పక్క పొలంలోని రైతు కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు వచ్చి చూడగా బన్సీలాల్ అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కొడుకు ఉన్నారు.


బన్సీలాల్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

నేరాల నియంత్రణకు సహకరించాలి

డీఎస్పీ నరేందర్‌గౌడ్

తూప్రాన్: నేరాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం పోలీస్ డివిజన్ పరిధిలోని హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్ నిర్వాహకులతో పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దాబాల వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. రాత్రి 12 గంటల లోపు హోటళ్లు, దాబాలు మూసివేయాలని సూచించారు. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దాబాల్లో మద్యం సిట్టింగ్‌లకు అనుమతి లేదని, నిర్వాహకులతో పాటు తాగిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో తూప్రాన్, రామాయంపేట, నర్సాపూర్ సీఐలు రంగాకృష్ణ, జాన్‌రెడ్డి, వెంకటరాజాగౌడ్, ఎస్‌ఐలు శివానందం, లింగం, చైతన్యరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

వేరే మహిళతో సహజీవనం

భర్తను పట్టుకున్న భార్య

చేర్యాల(సిద్దిపేట): మరొక మహిళతో సహజీవనం చేస్తున్న వ్యక్తిని పట్టుకొని భార్య, ఆమె బంధువులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన గురువారం పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... చిన్నకోడూరు మండల కేంద్రానికి చెందిన బాబు సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలున్నారు. కానీ కొంత కాలంగా కుటుంబానికి దూరంగా ఉంటూ పట్టణ కేంద్రంలో వేరే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. భర్త ప్రవర్తనపై అనుమానం వచ్చిన జ్యోతి గురువారం ఉదయం బంధువులతో కలిసి చేర్యాలకు వచ్చి, అతడు నివాసముంటున్న ఇంటి వద్దకు వెళ్లింది. అక్కడ వేరే మహిళతో కలిసి ఉండటం చూసి ప్రశ్నించిన భార్యపై దాడికి దిగిన బాబుకు జ్యోతి బంధువులు దేహశుద్ధి చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువురిని స్టేషన్‌కు తరలించారు. జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నీరేష్ తెలిపాడు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య

నర్సాపూర్ రూరల్: భర్తకు భార్య తల కొరివి పెట్టిన ఘటన నర్సాపూర్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. నర్సాపూర్ శివాలయం వీధిలో నివాసం ఉండే బురిగారి విఠల్ గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి పిల్లలు లేకపోవడంతో భార్య మంగమ్మ తలకొరివి పెట్టింది. ఈ ఉదంతాన్ని చూసి పలువురు కంటతడి పెట్టారు.

అదృశ్యమైన వ్యక్తి హత్య?

పోలీసుల అదుపులో అనుమానితులు

వట్‌పల్లి(అందోల్): అదృశ్యమైన వ్యక్తి హత్యకు గురయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని పల్వట్ల గ్రామానికి చెందిన మంగలి సాయిలు(53) గత నెల 18న నారాయణఖేడ్‌కు వెళ్లి విత్తనాలు కొనుగోలు చేసి, మండల కేంద్రంలోని ఓ మంగలి దుకాణంలో పెట్టి మళ్లీ వస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో సాయిలు భార్య నవరాణి ఈనెల 26న పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడి ఆచూకీ కోసం పోలీసులు, కుటుంబ సభ్యులు గాలించినా ఎటువంటి సమాచారం లభించలేదు. అయితే సాయిలుకు అతడి సోదరులు, బావలతో కొంత కాలంగా భూ వివాదం సాగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసులు సాయిలు తమ్ముడు మల్లేశంతో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు సమాచారం. సాయిలును మండల పరిధిలోని మర్వెల్లి గ్రామ శివారులో హత్య చేసినట్లు అనుమానితులు పోలీసుల ఎదుట ఒప్పుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు. హత్య జరిగిన ప్రదేశానికి వెళ్లి చూడగా సాయిలు మృతదేహం లభించలేదు. ఒకటి రెండు రోజుల్లో ఈ కేసు విషయమై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

కమలాపూర్‌లో వ్యక్తి హత్య

- తలపై పదునైన ఆయుధంతో దాడి
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ ప్రసన్నకుమార్


తోట సుధాకర్

పెద్దశంకరంపేట(మెదక్): వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మండలంలోని కమలాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన తోట సుధాకర్(43) ఆటో నడుపుకుంటూ గ్రామంలోనే ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతడికి గతంలో వివాహం కాగా భార్య చనిపోయింది. వీరికి దివ్యాంగుడైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. బుధవారం రాత్రి సుధాకర్ ఇంటిముందు నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు తలపై పదునైన ఆయుధంతో దాడి చేయగా అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు క్లూస్ టీం, జాగిలాలతో వివరాలు సేకరించారు. ఘటనాస్థలాన్ని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సీఐ.రేణుకారెడ్డి, ఎస్‌ఐలు ప్రవీణ్‌రెడ్డి, శంకర్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి తోట మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

పగలు కూలీ.. రాత్రి చోరీ

- నలుగురు నిందితుల అరెస్టు
- పదిరోజుల క్రితం మండల కేంద్రంలో చోరీ
- వివరాలు వెల్లడించిన ఏసీపీ

కొమురవెల్లి(సిద్దిపేట): చోరీ కేసులో నలుగురి నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రాజు, చేర్యాల సీఐ శ్రీనుతో కలిసి హుస్నాబాద్ ఏసీపీ సదానందం వివరాలు వెల్లడించారు. గత నెల 24న మండల కేంద్రంలో పోతుగంటి కొమురెల్లి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు బీరువా పగులగొట్టి 4తులాల బంగారు, 22 తులాల వెండి ఆభరణాలు దొంగిలించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణలో భాగంగా కొమురవెల్లి గ్రామ శివారులోని ఓ వెంచర్ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన బిజిలి సురేష్, అంగడి జంపయ్య, దాసరి అశోక్, ముదగాని సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి 9 తులాల బంగారం, 22తులాల వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్, మూడు ద్విచక్రవాహనాలు, ఒక ఇనుపరాడ్డును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాతో సంబంధం ఉన్న అనరెడ్డి రవి, కూజ నర్సయ్య పరారీలో ఉన్నారని, గాలిస్తున్నామని తెలిపారు. ఏడాదిగా ఈ ముఠా సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా నుంచి వచ్చి హైదరాబాద్ నేరేడ్‌మెట్ ప్రాంతంలోని వినాయక నగర్‌లో ఉంటూ ఉదయం కూలీ పని చేస్తూ రాత్రి చోరీలకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 18 దొంగతనాలకు పాల్పడ్డారని చెప్పారు. నిందితులపై పలు కేసులున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ రాజు, కానిస్టేబుల్ రమేష్ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సదానందం, చిత్రంలో నిందితులు